


# ప్రతిభకి కొలమానం

'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్!' అన్నప్పుడు దేశం బావుంటే (మట్టి సారవంతమైనదీ, ఖనిజ సంపదతో కూడుకొన్నదీ) ప్రజలు బాగుపడ్తారా, లేదా ప్రజలు బావుంటే (నిస్వార్థ పరులూ, సన్మార్గ వర్తనులూ) దేశం బాగుపడ్తుందా అన్నది ఓ ధర్మ సందేహమే అనుకోవాలి. అయితే ఎంతటి ప్రజల ప్రభుత్వమైనా నాయకుడనే వాడొకడు లేకపోతే, జనాలు నలుదిశలా పరుగులు తీస్తూ, దేశాన్ని అయిదో దిక్కయిన ఆకాశంలోకి ఎత్తకుండా, ఆరో దిక్కయిన అధఃపాతాళంలోకి తొక్కి పారేస్తారు. అయితే వాస్తవానికి మొదటి పని చెయ్యడానికే జనాలు నాయకుణ్ణి ఎన్నుకొని అధికారముద్రనిస్తారు. అయితే నాయకులు రెండో పని చెయ్యడంలో చాలా ఎక్కువ సమర్థత చూపుతారు. ఆ నాయకులేం చేసినా ప్రభుత్వం కూలే వరకూ లేదా మారేవరకూ జనాలు చెయ్యగలిగింది బహుస్వల్పం. మళ్ళీ వచ్చే ఎన్నికల్లో బేరీజు వేసుకొని కొత్త నాయకుల్ని ఎన్నుకోవడమో, కొత్త అవతారం ఎత్తిన పాత నాయకుల్నే ఎన్నుకోవడమో జరుగుతుంది. ఎన్నికైన ప్రజాప్రతినిధుల శక్తి సామర్థ్యాల మీదా, ఋజువర్తన మీదా దేశ ప్రగతి ఆధారపడి ఉంటుంది. ప్రజల క్రమశిక్షణ దేశ ప్రగతికి మరింత దోహదం చేస్తుంది.

యిలాగే సంస్థలంటేనూ కేవలం యంత్రాలూ, ఫైళ్ళూ కావు. సంస్థలంటే ఉద్యోగులు. ఉద్యోగులు శక్తి సామర్థ్యాలతో పనిచేస్తే సంస్థ అభివృద్ధి చెందుతుంది. సంస్థ అభివృద్ధి చెందితే ఉద్యోగులూ అభివృద్ధి చెందుతారు. ఈ విషయంలో పెట్టుబడిదారీ రంగానికీ, ప్రభుత్వ రంగానికీ, ప్రజలకీ తరచు భేదాభిప్రాయాలు కలుగుతూ ఉంటాయి.

సంస్థ నియమాల ప్రకారమూ ఏవో కొన్ని వ్రాత పరీక్షల్లూ, అంతర్వీక్షణాలూ నిర్వహించి యితడూ లేక ఈమె సమర్థవంతంగా పనిచెయ్యగలడు లేదా చెయ్యగలదు అనే నమ్మకంతో ఉద్యోగాల్లోకి తీసుకొంటుంది. అటుపైన సంస్థ యిచ్చే శిక్షణ మీదా, ఉద్యోగుల క్రమశిక్షణ



మీదా సంస్థ పురోగతి ఆధారపడి ఉంటుంది.

కాని జరిగేదేమిటంటే – ఒకటో రకం విద్యార్హతలున్నా సమర్థులు కానివారూ, నాసిరకం అర్హతలున్నా అధికంగా శ్రమించి పనిచేసేవారూ, పని దొంగలూ, పనే ప్రాణంగా భావించే 'వర్కుహోలిక్సూ' ప్రతి సంస్థలోనూ జన్మలెత్తుతారు. అయితే వీరి నిష్పత్తి ప్రభుత్వ రంగంలో ఒకలా, పెట్టుబడిదారీ రంగంలో మరొకలా ఉంటుందని వేరే చెప్పనవసరం లేదు.

సాధారణంగా జరిగేదేమిటంటే ఇరవై శాతం ఉద్యోగులు ఎనభై శాతం పని చేస్తే, ఎనభై శాతం మిగిలిన ఉద్యోగులు ఆ యిరవై శాతం పని చేస్తారు (?). బాగా పనిచేసే వారిని బహుకరించకపోయినా, నిర్లక్ష్యపరుల్ని శిక్షించకపోయినా ఏ సంస్థ అయినా దెబ్బతినక మానదు.

బహూకరించే విధానాలు – ప్రశంసాపత్రాలు, ధన రూపేణా పారితోషికాలు, జీతంలో పెంపుదలలు, పై పదవులు వగైరాలు కాగా, శిక్షించే పద్ధతులు – హెచ్చరిక పత్రాలు, జీతపు పెంపుదలల్ని నిరాకరించడాలూ, పై పదవుల్లోకి పంపకపోవడాలూ, ఆఖరి అస్త్రంగా పదవీచ్యుతుణ్ణి చెయ్యడాలూ వగైరా అయి ఉంటాయి. అయితే మొదటిది చేసినంత సులువు కాదు రెండోది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఈ విషయంలో కూడా సీన్లూ, సినేరియోలు వేర్వేరుగా ఉంటాయనీ చెప్పనక్కర్లేదు.

ఛీఫ్ యింజనీర్ నిరంజన్ గుప్తా జనరల్ మేనేజర్ రాకేష్ శర్మ గదిలో అడుగు

పెట్టాడు. నిరంజన్ గుప్తా ముఖకవళికలు చూసి కుర్చీలో కూర్చోమని సైగ చేసి, ఏమిటీ విషయమన్నట్లుగా కనుబొమలెగరవేశాడు రాకేష్‌శర్మ.

"ఆ జూనియర్ యింజనీర్ ధీరజ్‌కుమార్‌ని అదుపులో ఉంచడం మా తరం కాదు! పని సరిగ్గా చెయ్యకపోవడమే కాకుండా తల పొగరుగా ప్రవర్తిస్తున్నాడు. అతగాణ్ణి మరో విభాగానికి పంపిస్తూ ఉత్తర్వులివ్వండి!" అన్నాడు నిరంజన్ గుప్తా.

అది అభ్యర్థనో, ఆజ్ఞో తెలియలేదు రాకేష్‌శర్మకి. అయితే గొంతులో మట్టుకు ఆవేశమూ, ఆవేదనా స్ఫురించాయి.

"దానికింత ఆవేశమెందుకు? ఓ మెమో ఇవ్వండి" అన్నాడు రాకేష్ శర్మ తాపీగా.

"అతను ఓ ఎమ్.ఎల్.ఎ. రికమెండేషన్ మీద సెలెక్ట్ అయ్యాడు. అందుకని..." మిగిలిన మాటల్ని మింగివేశాడు నిరంజన్ గుప్తా.

"అతగాడు కేవలం ఓ జూనియర్ యింజనీర్! అతని పనిని పర్యవేక్షించే సీనియర్ యింజనీర్ చేత మెమో యిప్పించండి."

"అదే చెప్పాను. అతనికి మోమో యిస్తే యితరుల పని కూడా పాడు చేస్తాడన్న భయంకొద్దీ యివ్వనన్నాడు"

"అయితే మీరివ్వండి"

"ధీరజ్‌కుమార్ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ హెడ్ ముకుంద్ యాదవ్ మేనల్లుడు. కొలీగ్‌గా నేను కొంచెం జాగ్రత్త వహించాలి. ముకుంద్ యాదవ్ సంగతి మీకు తెలుసుగా. ప్రతీదీ వ్యక్తిగతంగా తీసుకొని కక్ష గడ్తాడు."

"మెమోలివ్వడానికి మీకందరికీ అధికారాలున్నాయి. అధికార దుర్వినియోగం ఎంత నేరమో, అవసరమొచ్చినప్పుడు వినియోగ రాహిత్యం కూడా అంతే నేరం. అది పిరికితనాన్ని సూచిస్తుంది. మీరందరూ నా భుజం మీద తుపాకీ పెట్టి పేల్చడానికి ప్రయత్నిస్తున్నారు! దానికి నేను సిద్ధమే - కాని, నా కంటే ఎన్నో మెట్లు దిగువగా ఉన్న ఓ ఉద్యోగికి మెమో యివ్వాలంటే. నాకూ సాక్ష్యాధారాలు కావాలి. అందుచేత మీరతని నిర్లక్ష్యధోరణిని సోదాహరణంగా చూపిస్తూ ఓ కాయితాన్ని కదిలించండి. నేను చర్య తీసుకొంటాను."

నిరంజన్ గుప్తా కాస్త అయిష్టంగానే తలాడిస్తూ బయటపడ్డాడు– 'ఏ రాయైనా ఒకటే పళ్ళూడగొట్టుకోవడానికి!' అనుకొంటూ.

రాకేష్ శర్మ పి.ఎ.కి ఆదేశాలిచ్చాడు.

"డిప్యూటీ జనరల్ మేనేజర్ సర్వేశ్వరశాస్త్రిని, ఛీఫ్ ఇంజనీర్ గోపాల్ కదమ్‌నీ రమ్మని చెప్పండి."

పి.ఏ. ద్వారా కబురందుకొని ఓ పది నిముషాల వ్యవధిలో యిద్దరూ వచ్చి సుఖాశీనులైయ్యారు. రాకేష్ శర్మ బల్ల మీద రహస్య వార్షిక నివేదికలు దొంతులు

దొంతులుగా పేర్చబడి ఉన్నాయి. రాకేష్ శర్మ పసుపు పచ్చని చిన్న కాయితం పిన్ చేయబడి ఉన్న ఓ ఎ.సి.ఆర్.(Annual Confindential Report)ని చేతిలోకి తీసుకొంటూ అన్నాడు.

"మిస్టర్ గోపాల్ కదమ్! రిపోర్టింగ్ ఆఫీసరుగా మీరు వ్రాసిన ఈ ఎ.సి.ఆర్. సంజయ్ బన్సల్ అనే ఓ సీనియర్ యింజనీర్‌ది. రెండో పేజీలో ముందస్తుగా అతను వ్రాసుకొన్న స్వంత బేరీజుకి, మీరు అతన్ని గురించి వ్రాసిన దానికీ కొన్ని విషయాల్లో పొంతన లేదు చూడండి."

కదమ్ రాకేష్‌శర్మ వద్ద నుండి ఏ.సి.ఆర్. అందుకొని రెండో పేజీ చూడసాగాడు.

రాకేష్‌శర్మే మళ్ళీ అన్నాడు.

"బన్సల్ వ్రాసుకొన్న స్వయం ప్రతిభా వ్యాసంలో వ్యాకరణ దోషాలూ, స్పెల్లింగ్ తప్పులూ కోకొల్లలు! అవన్నీ ఎర్రసిరాతో గుర్తించాను. సీనియర్ యింజనీరయి ఉండీ పదో క్లాసు కుర్రవాడి కన్నా అధ్వాన్నంగా ఇంగ్లీషు వ్రాశాడు!

"అతనికి యింగ్లీషంటే సరిగా రాదు కాని, పని బాగా చేస్తాడు" - సర్వేశ్వరశాస్త్రి కల్పించుకొని అన్నాడు.

"ఆ సంగతి నేనూ తెలుసుకొన్నాను. కానీ పదో పేజీ తిరగవేయండి. భావ ప్రకటనా సామర్థ్యం అనే విషయానికెదురుగా బన్సల్‌ని గురించి కదమ్ వ్రాసిన వ్యాఖ్యల్ని చూడండి. లిఖితపరంగా అత్యుత్తమం - వాక్పటిమపరంగా అత్యుత్తమం. ఆ మధ్య మంత్రి మహాశయులు మన ప్లాంట్‌ని దర్శించినపుడు బన్సల్ మొదట యింగ్లీషులోనూ, ఆ తర్వాత హిందీలోనూ యంత్ర వివరాలు చెప్పడంలో విఫలుడైనప్పుడు, సర్వేశ్వర శాస్త్రిగారూ, మీరూ కల్పించుకుని చెప్పవలసి వచ్చింది. మరి ఆ రెండు అత్యుత్తమలూ ఎలా యిచ్చారో నా కర్థం కావట్లేదు! అంటే గోపాల్ కదమ్ యాథాలాపంగా ఎ.సి.ఆర్. పూరించడం, మీరూ యాంత్రికంగా పునఃపరిశీలించడం జరిగిపోయిందన్నమాట! బన్సల్ శక్తి సామర్థ్యాల గురించి నేను ప్రశ్నించకపోయినా, ఈ ఏ.సి.ఆర్. చూస్తే మీ నిర్లక్ష్య వైఖరి ద్యోతకమౌతుంది!" రాకేష్‌శర్మ మెత్తగా మందలించాడు.

సర్వేశ్వరశాస్త్రి తప్పంతా నీదేనన్నట్లుగా గోపాల్ కదమ్ వైపు చూశాడు. కదమ్ తెల్లమొహం వేసి లోలోపల ఉడికిపోయాడు.

"సంజయ్ బన్సల్ మంచి పనిమంతుడని నాకు తెలుసు. అయితే అతను తన గురించి వ్రాసుకొన్న వ్రాతకీ, ఆ విషయమై మీరు వ్రాసిన అభిప్రాయానికీ పొంతన లేకపోవడం మెంబరు కనుక గమనించడం జరిగితే, చిందులు తొక్కుతాడు. చివరగా సంతకం చేసిన నాకూ అపప్రథే! మరో ఫారం తీసుకొని అతనికిచ్చి, తప్పుల్లేకుండా తిరగ వ్రాయించి, ఆ పైన మీ రిపోర్టులూ, రివ్యూలు వ్రాసి తిరిగి పంపించండి. ఏమీ అనుకోవద్దు. మీరూ

నాలాగే డిక్షనరీలు దగ్గరుంచుకోండి!" అన్నాడు రాకేష్‌శర్మ.

"మార్చి నెల వచ్చే సరికి లక్ష్యసాధన కోసం హడావుడి. అందుకనే నేను పూర్తి ధ్యానం యివ్వలేకపోయాను. మీరు ఒప్పుకొంటే ఈ ఒక్క ఏ.సి.ఆర్. కాకుండా, నేను రివ్యూ చేసిన అన్ని ఏ.సి.ఆర్.లనీ మరోసారి చూస్తాను" అన్నాడు సర్వేశ్వరశాస్త్రి చిన్న బోయిన మొహంతో.

రాకేష్‌శర్మ అలాగేనంటూ ఓ దొంతరం వైపు చూశాడు. గోపాల్ కదమ్ వాటిని తీసుకొనీ, సర్వేశ్వరశాస్త్రి అతన్ని వెన్నంటీ బయటకు దారి తీశారు – 'ఎనిమిది నెలల క్రితం కొత్తగా వచ్చిన ఈ జి.ఎమ్. ఘటికుడే' అని గుసగుసలాడుకొంటూ.

ఆ తర్వాత డి.జి.ఎమ్. (ప్రాజెక్ట్) ప్రశాంత్ అరోరా, రాకేష్‌శర్మ పిలుపందుకొని ఏం గొడవ వచ్చి పడిందేమోనన్న కంగారుతో వెళ్ళాడు. అతగాడు కుర్చీలో కూర్చున్న వెంటనే రాకేష్‌శర్మ వేరే ఉపోద్ఘాతం లేకుండా తిన్నగా అడిగాడు.

"సీనియర్ యింజనీర్ రామారావుని గురించి మీ అభిప్రాయం ఏమిటి?"

"ఒక్క మాటలో చెప్పాలంటే సాన బెట్టిన వజ్రం" అన్నాడు అరోరా.

"రామారావుని తమ గ్రూప్‌లోకి మార్చమని మీకింద పన్జేస్తున్న ఛీఫ్ యింజనీర్లు అడపాదడపా వచ్చి నన్ను అభ్యర్థించారు. 'మీరందరూ ఆరోరా కింద పన్జేస్తున్నారు. కాబట్టి ఆయన్నే అడగండి. మనుషుల్ని ఒక గ్రూప్‌లోంచి మరో గ్రూప్‌లోకి మార్చడానికి ఆయనకి పూర్తి స్వాతంత్ర్యముంద'నీ చెప్పి పంపించేశాను."

"రామారావు చాలా సమర్ధవంతుడైన ఆఫీసరు. చాలా శ్రమించి పన్జేస్తాడు. యిటు సహ ఉద్యోగులతో, పై అధికారులతోనే కాకుండా, ప్లాంట్‌లో ఉన్న వర్కర్స్ అందరితో భేషజం లేకుండా ప్రవర్తిస్తాడు. అతనంటే అందరికీ యిష్టమే. యితర గ్రూప్‌ల మంచి కోసం మారుద్దామని ప్రయత్నించాను కాని అతని బాస్ మహదేవన్ ససేమిరా ఒప్పుకోవటల్లేదు!"

"అంటే ప్రస్తుతం మన ప్లాంట్‌లో ఉన్న సీనియర్ యింజనీర్లందరిలోనూ రామారావు బెస్టని అనుకోవడంలో తప్పులేదు కదా?"

"మీరన్నది నూటికి నూరు పాళ్ళు నిజం" అన్నాడు ఆరోరా.

"అవునా, మరి! ఈ ఏ.సి.ఆర్. చూడండి. రామారావు బాస్ మహదేవన్ చాలాసమర్థుడే కాని తిక్కమనిషి. అతని ప్రమాణాలు చాలా ఎక్కువ. చేతికి సడలింపు తక్కువ. అతను రామారావు కిచ్చిన అంతిమ రాంకింగ్ అత్యుత్తమం. యింక అతని గ్రూప్‌లో మిగిలిన వాళ్ళ సంగతి మీరూ ఊహించవచ్చు. ఊహించడమేమిటి, మీరు గమనించే ఉండాలి. మహదేవన్‌తో సహా మీ కింద అయిదుగురు ఛీఫ్ ఇంజనీర్లు పన్జేస్తున్నారు. మిగిలిన నలుగురూ వాళ్ళ కింద పన్జేస్తున్న యింజనీర్ల ఏ.సి.ఆర్. విషయాల్లో చాలా స్వేచ్ఛగా

కలం కదిలించారు. రామారావు సామర్థ్యానికి ఏ పాటి దగ్గర దూరంలో లేని ఎనమండుగురికి విశిష్ట స్థానాన్ని యిచ్చారు!"

'టైం స్కేల్ ప్రమోషనలివ్వడం మొదలుపెట్టినప్పట్నుంచీ ఏ.సి. ఆర్స్‌కి ప్రాముఖ్యత పెరిగిన సంగతి తెలియంది కాదు. కింద వాళ్ళ ఉసురు తగలకుండా మంచి రిపోర్టులిచ్చి చేతులు కడిగి వేసుకొంటున్నారు" అన్నాడు ఆరోరా వేదాంత ధోరణిలో.

"మరింత మంది విశిష్టమైన యింజనీర్లు ప్లాంట్‌లో ఉండగా, వార్షిక లక్ష్యాలని ఎందుకు సాధించలేకపోయాం?"

రాకేష్‌శర్మ నుండి అనుకోకుండా వచ్చిన ఈ ప్రశ్నకి జవాబివ్వడానికి తడబడ్డాడు ఆరోరా.

"స్టోర్సు డిపార్ట్‌మెంట్ వాళ్ళు కొనుగోలు చర్యలు ఆలస్యం చేశారు. ముడి సరుకు సకాలంలో అందలేదు."

"డి.జి.ఎమ్. (స్టోర్సు), డి.జి.ఎమ్ (ఫైనాన్స్)లు మీరిచ్చిన స్పెసిఫికేషన్స్ సరిగా లేనందు మూలాన రెండు సార్లు టెండర్లని పిలవవలసి వచ్చిందని ఆలస్యానికి కారణం మీరే అన్నారు. తమ దగ్గర పన్జేసే వాళ్ళందరికీ విశిష్ట స్థానాలూ, అత్యుతమ స్థానాలూ కోకొల్లలుగా ప్రసాదించేశారు. యిలా అందరూ అందర్నీ అందలాలెక్కించేసినా పని మట్టుకు మందకొడిగా సాగుతోంది! ఈ రిపోర్టులనన్నింటినీ నేను ఫైనల్‌గా అప్రూవ్ చేస్తూ సంతకాలు పెట్టి పంపిస్తే, ఛైర్మన్ అడిగే మొదటి ప్రశ్న ఇదే! దీనికి నా వద్ద జవాబు లేదు, మీరు చెప్పగలిగితే సంతోషిస్తాను" అన్నాడు రాకేష్‌శర్మ.

జి.ఎమ్. రాకేష్‌శర్మ మాటల్లోని సత్యం తెలియనివాడు కాదు అరోరా. కాని ఈ సంభాషణ వెనుక తన నిర్లక్ష్యవైఖరిని ఎత్తి చూపే ప్రయత్నం ఉందని గ్రహించాడు.

రాకేష్‌శర్మ కూడా అదే విషయాన్ని ప్రస్తావించాడు.

"వాస్తవానికి సగటు లేక ఉత్తమ స్థానాలకే అర్హులైన ఆఫీసర్లకి అత్యుత్తమాలూ, విశిష్టాలూ యిస్తే ఆయా వ్యక్తులకి మేలు చేస్తాయే కాని, సర్వసమర్థుడైన రామారావుకి మహదేవన్ యిచ్చిన రాంకింగ్ అతనికి నష్టాన్ని కలుగజేసి, సంస్థని దోషిగా నిలబెడ్తుంది. ఒకవేళ మహదేవన్ రామారావుకి విశిష్ట స్థానాన్ని యిచ్చినా, అతనూ అందర్లోనూ ఒకడే అవుతాడు కాని ప్రథముడు కాలేడు. ఈ ఏ.సి.ఆర్స నన్నింటినీ సమగ్రంగా పరిశీలించి, ఓ ప్రమాణ ప్రకారం సమతుల్యం కావించి అందలం ఎక్కించిన వాళ్ళని దించి, నిజంగా అర్హులైన వారికి న్యాయం చేకూర్చే పునఃసమీక్షాధికారం మీ చేతిలో ఉంది. కాని మీరు గుడ్డిగా సంతకాలు చేసి ఆ కర్తవ్యంలో విఫలులైయ్యారు. మరింతకీ రామారావు సంగతి ఏం చేద్దామంటారు?"

"అతని ఏ.సి.ఆర్. తిరిగి నా కివ్వండి. మహదేవన్ యిచ్చిన రాంకింగ్ తక్కువ అని

జస్టిఫికేషన్ యిస్తూ, విశిష్ట స్థానంలో విశిష్టుదని రివ్యూ వ్రాసిస్తాను."

"మరి అందలాలు ఎక్కినవారి మాట?"

"వారి నలాగే ఉండనివ్వండి. ఈ రిపోర్టు లెంత రహస్యమైనా ఉద్యోగులు కూపీలు లాగి అలిగి కూర్చుంటారు! కాదంటే నా సి.యి.ల చేత పనిచేయించుకోవడం కష్టమైపోతుంది."

రాకేష్‌శర్మ చిన్నగా నవ్వుతూ, "సరే, అలాగే కానివ్వండి. ఎందుకంటే మీ చేత కూడా నేను పని చేయించుకోవాలిగా?!" అంటూ ఓ చిన్న చురక అంటించి, రామారావు ఏ.సి.ఆర్. అరోరా కందించాడు.

అరోరా బ్రతుకుజీవుడా అనుకొంటూ బయటపడ్డాడు.

నిరంజన్ గుప్తా ధీరజ్‌కుమార్ విషయమై స్టెనో చేత టైప్ చేయిస్తే వార్త ముందే పొక్కి పోతుందన్న భయంతో, స్వహస్తాలతో నోట్ వ్రాసి, ఫైల్లో పెట్టి, రాకేష్‌శర్మ గదిలో ప్రవేశించి, మరోసారి విష్ చేసి, కుర్చీలో కూర్చున్నాడు. తీసుకువచ్చిన ఫైల్‌ని రాకేష్‌శర్మ ముందుంచాడు. రాకేష్‌శర్మ యింటర్‌కాంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు దేశ్‌పాండేని - ధీరజ్‌కుమార్‌దీ, అజయ్‌ఘోష్ అనే మరో జూనియర్ యింజనీర్‌దీ, మిస్ అనితావర్మ అనే సీనియర్ ఇంజనీర్‌దీ పర్సనల్ ఫైల్స్ తీసుకురమ్మని ఆదేశించాడు.

దేశ్‌పాండే ఆ ఫైల్సు తీసుకుని వచ్చాడు.

"ధీరజ్‌కుమార్ ఫైల్ చూసి అతనికిది వరకుఎవరైనా మెమో లిచ్చారేమో చెప్పండి" అన్నాడు రాకేష్‌శర్మ.

దేశ్‌పాండే ఫైలు చూసి, "యితనికింతవరకూ ఎవరూ మెమోలు యివ్వలేదు. మొన్న జనవరి 26 రిపబ్లిక్‌డే సందర్భంగా ప్రశంసాపత్రం ఇవ్వబడింది. అతని నాలుగేళ్ళ సర్వీసులోనూ యిది రెండోది!" అన్నాడు.

రాకేష్‌శర్మ నిరంజన్ గుప్తా వైపు ప్రశ్నార్థకంగా చూశాడు. ఆ చూపుల వెనుక ఈ అవార్డులు కమిటీలో తమరూ ఒక మెంబరే కదా?' అన్న హేళన కన్పించింది నిరంజన్‌గుప్తాకి.

"అతనికివ్వడానికి నేను ఒప్పుకోలేదు. కాని అతని మేనమామ ముకుంద్ యాదవ్ యితని కేసు గట్టిగా వాదించి, మిగిలిన కమిటీ మెంబర్లని ఒప్పించాడు" - నిరంజన్ గుప్తా వివరణ యిచ్చాడు రాకేష్‌శర్మ నోరు విప్పి అడగకపోయినా.

"యింతకీ అతని పేరు రికమెండ్ చేసిందెవరు?"

"అప్పటికి అతను పనిచేస్తున్న గ్రూప్ హెడ్ అజిత్ బారువా"

"అక్కడో ప్రశంసాపత్రం యిప్పించి మీ విభాగంలోకి తోసి వేశారన్నమాట! యిప్పుడితనికి మెమో యిస్తే ఈనాటి మెమోనీ, నిన్నటి ప్రశంసాపత్రాన్నీ నోటీసు బోర్డులో

పెద్దాడు! అయినా గుడ్డిలో మెల్ల! సెక్షన్ మారాడుగా. నెమ్మదిగా కేసు బిల్డప్ చెయ్యండి. ఎవరికీ భయపడకుండా ఏప్రిల్ నెలాఖరులో ఓ మెమో యివ్వండి. ఈలోపుగా నోటిమాటగా ఒకటి, రెండుసార్లు హెచ్చరించండి. అన్నట్టు మరో మాట గుర్తుంచుకోండి. ఈ ప్రశంసాపత్రం గొడవ కనక లేకపోతే, నేను మీరిచ్చే నోట్ మీద ఏం వ్రాసి ఉండేవాడినో గ్రహించగలరా? వెంటనే మెమో యివ్వండి అని వ్రాసి తిరిగి మీకే పంపించేవాణ్ణి. ఎందుకంటే ఈ ప్రాజెక్టు హెడ్‌గా నేను మొరలు వినే దొరని. న్యాయాన్యాయాలు విచారించి శిక్షించడాలూ, రక్షించడాలూ నా పని కాని, మీ పర్యవేక్షణలో పనిచేస్తున్న వాళ్ళకి మెమో లివ్వడం కాదు! మీరందరూ టెక్నికల్ ఆఫీసర్లయినా అడ్మినిస్ట్రేటివ్ రూల్సు తెలిసుండాలి!" – రాకేష్‌శర్మ మెత్తగా మందలించాడు.

నిరంజన్ గుప్తా నిశ్శబ్దంగా ఫైల్‌ని వెనుక్కు తీసుకున్నాడు.

"మిస్టర్ దేశ్‌పాండే! ఈ సంవత్సరంలో నాలుగు మెమోలందుకొన్న అజయ్‌ఘోష్ జనవరి 26న ప్రశంసాపత్రం అందుకొని, తన ప్రమోషన్ విషయమై కోర్టు కెక్కిన వైనం, మొన్న మీరు లాయరు ఫీజు శాంక్షన్ కోసమై పుటప్ చేసిన ఫైల్లో చూశాను. నంబూద్రిలాంటి డి.జి.ఎమ్. పూర్వాపరాలు ఆలోచించకుండా అజయ్‌ఘోష్ చెంచాగిరీకి ప్రసన్నుడై ప్రశంసాపత్రాన్ని యిప్పించి ఈ సంస్థనే యిరకాటంలో పెట్టి వేశాడు! ఈ విషయంలో మీ పాలనా యంత్రాంగం కూడా బాధ్యత విస్మరించి తప్పటడుగు వేసింది. యికపై అవార్డ్ కమిటీ రికమెండ్ చేసిన ఉద్యోగుల తాలూకు పర్సనల్ ఫైల్స్‌లో వారి పూర్వాశ్రపు లీలలు వెరిఫై చేసి, ఆ తర్వాతనే ఆఖరి నిర్ణయం చేసి అప్రూవల్‌కి పంపండి. యిక నుంచీ ప్రతి అవార్డు కమిటీలోనూ ఎ.ఓ. తప్పనిసరిగా కార్యదర్శి పాత్ర వహించాలని ఈ రోజే ఉత్తర్వులు జారీ చేస్తాను. ఆశ్రిత పక్షపాతంతోనూ, భయంతోనూ వంతుల వారీగా యిచ్చే ఈ ప్రశంసాపత్రాలకి విలువ లేకుండా పోతోంది. ఆc, అన్నట్టు మరిచాను" అంటూ యింటర్‌కాం బటన్ నొక్కి పి.ఏ.ని ఉద్దేశిస్తూ, "వెంటనే ఛీఫ్ యింజనీర్ రాజ్‌మెహతాని రమ్మని పిలవండి" అన్నాడు.

నిరంజన్ గుప్తా, దేశ్‌పాండేలు లేచి వెళ్ళబోతుండగా వద్దని వారించాడు రాకేష్‌శర్మ.

రాజ్‌మెహతా ఆర్భాటంగా గదిలో ప్రవేశించి, అందరికీ విష్ చేసి, దేశ్‌పాండే పక్క కుర్చీలో కూర్చున్నాడు.

రాకేష్‌శర్మ తన ముందున్న దొంతుల్లోంచి ఎల్లో స్లిప్ పిన్ చేసిన ఓ ఏ.సి.ఆర్. తీసి అన్నాడు.

"ఈ ఏ.సి.ఆర్. సీనియర్ యింజనీరు మిస్ అనితావర్మది. ఆమెకు మీరు సగటు కన్నా అధ్వాన్నం యిచ్చారు, మిస్టర్ రాజ్‌మెహతా! దేశ్‌పాండే, మీరు ఆమె ఫైలు తీసి వివరాలు చూసి చెప్పండి."

దేశ్‌పాండే అనితావర్మ పర్సనల్ ఫైల్లోకి చూస్తూ, "ఈమెకు నిరుడు సంవత్సరం విశిష్ట, అంతకు క్రితం అత్యుత్తమం రాంకింగ్ యివ్వబడింది. ఆరేళ్ళలోనూ రెండు ప్రశంసాపత్రాలు లభించాయి." అన్నాడు.

రాకేష్‌శర్మ రాజమెహతావైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఏమో, పాత సంవత్సరాల ప్రతిభ సంగతి నాకు తెలియదుకాని, ఈ సంవత్సరం నా సెక్షన్లో పనిచేసిన తీరు చూస్తే ఆమెని సరిగానే అంచనా వెయ్యడం జరిగింది. అందుకని నేనిచ్చిన రాంకింగ్ సరైనదే అనుకొంటున్నాను. మా డి.జి.ఎమ్. కూడా అంగీకరించి సంతకం చేశారు" అన్నాడు రాజ్‌మెహతా.

"మీ డి.జి.ఎమ్. సెలవు మీద ఉన్నాడు కాబట్టి మిమ్మల్ని పిలిచాను. ఈమె పని సక్రమంగా పని చెయ్యనప్పుడు హెచ్చరించడం జరిగిందా?"

"నోటి మాటగా ఒకటి రెండుసార్లు చెప్పాను."

"నోటిమాటగా కాదు లిఖితపూర్వకంగా?"

"..." రాజ్‌మెహతా మౌనం వహించాడు.

"మిస్టర్ దేశ్‌పాండే?"

"ఆమె సర్వీసు మొత్తం మీద ఒక్క మెమో కూడా లేదు సాబ్!"

"మిస్టర్ రాజ్‌మెహతా! మూడుసార్లు లిఖితపూర్వకంగా హెచ్చరించి, మార్పు రాకపోతేనే ఏ.సి.ఆర్.లో నెగిటివ్ రాంకింగ్ యివ్వాలన్న సంగతి మీకు తెలియదా?"

"..." రాజ్ మెహతా మళ్ళీ మౌనం వహించాడు.

"మీకూ తెలియదు, మీ డి.జి.ఎమ్.కూ తెలియదు! మీరిద్దరూ హైదరాబాద్ అడ్మినిస్ట్రేటివ్ శిక్షణా కేంద్రంలో తర్ఫీదు కూడా పొంది వచ్చారు! అనితావర్మ శక్తి సామర్థ్యాలని మీరు సరిగా అంచనా వేశారో లేదో నాకు తెలియదు కాని, టెక్నికల్ గ్రౌండ్సు మీదా, పాలనా నియమాల వల్లా ఆమె ఏ.సి.ఆర్. పాడు చేసే అధికారం మీకు లేదు! ఈ సంవత్సరం తనకి రావల్సిన సూపరింటెండెంట్ యింజనీరు ప్రమోషన్ రాక ఆమె అర్జీ పెట్టుకొంటే డొంకంతా కదుల్తుంది! తన ఫెర్‌ఫారమెన్స్ గురించి హెచ్చరించబడి ఉన్నట్లైతే తన తప్పుల్ని సరిదిద్దుకొనే అవకాశముండేదని వాదిస్తుంది. పని బాగా చెయ్యటల్లేదని వ్రాసి ఊరుకొంటే రూల్సు ఒప్పుకోవు. సకాలంలో కింద పని చేసే వారిని హెచ్చరించి, పని తెలియకపోతే చెప్పి, వారి చేత సక్రమంగా పని చేయించడం కూడా పై ఆఫీసర్ల బాధ్యత. మరి ఈ ఏ.సి.ఆర్.ని గురించి ఏం చేద్దామంటారు?"

"రూల్సు తెలియక చేశాను. పొరపాటై పోయింది. మీరు నాకు మరో ఫారం యిస్తే తప్పుదిద్దుకొంటాను" అన్నాడు రాజ్‌మెహతా లోగొంతుకలో.

దేశ్‌పాండే అతనికి మరొక బ్లాంక్ ఫారం యివ్వగా, రాజ్‌మెహతా డీలా పడిపోయి

బయటకు దారితీశాడు.

"అనితావర్మ, చంద్రశేఖరరెడ్డి అనే ఓ సీనియర్ యింజనీర్‌తో చనువుగా ఉండడం చూసి కన్నుకుట్టి రాజ్‌మెహతా ఈ పని చేసి ఉంటాడు. మీకు తెలిసిందో లేదో తెలియదు కాని, మీరు రెణ్ణెల్ల క్రితం అమెరికా వెళ్ళినప్పుడు ఈ విషయమై చిన్న ఘర్షణ జరిగింది" అన్నాడు నిరంజన్ గుప్తా సన్నాయి నొక్కులు నొక్కుతూ.

"అలాగా?!" అన్నాడు రాకేష్‌శర్మ గుంభనంగా. నిజానికి ఈ విషయమై అమెరికా నుంచి తిరిగి రాగానే తన పి.ఏ. గుహ్ చెప్పాడు.

'రాజమెహతా కపటసూత్రధారి. ఈ ఏ.సి.ఆర్. విషయంలో అతన్ని మందలించినందుకు నా మీదే ఎటువంటి దుష్ప్రచారాన్నైనా చెయ్యగల ఘటికుడు. అందుకనే అతనితో మాట్లాడుతోన్నప్పుడు మిమ్మల్ని కదలనివ్వకుండా సాక్ష్యంగా ఉంచుకొన్నాను!' – ఈ మాటలు రాకేష్‌శర్మ గుండెల్లోనే ఉండిపోయాయి కాని గొంతు దాటి రాలేదు. పెదాల మీద చిరునవ్వు తెచ్చుకొని, "ఉండండి, కాఫీ తెప్పిస్తాను" అంటూ బెల్ స్విచ్ నొక్కేడు.

అప్పటికే లేచి నిలబడ్డ వారిద్దరూ మురిసిపోతూ తిరిగి కూర్చున్నారు. రాజస్థాన్ ప్రాజెక్ట్‌ను ఉద్ధరించడానికి బదిలీ మీద ఎనిమిది నెలల క్రితం వచ్చిన రాకేష్‌శర్మలో మొదటిసారిగా ఓ అధికారిని కాక ఓ గురువుని గుర్తించగలిగాడు నిరంజన్ గుప్తా. ధీరజ్‌కుమార్‌కి మెమో యివ్వాలంటే అతనికిప్పుడు మనసులో భయం లేదు.

ఉన్నతాసనంలో కూర్చున్న వాళ్ళు అన్ని దిశలా దృక్కులు సారించాలి.

**ముక్తాయింపు:**

"కిరణ్‌కుమార్‌కి యూనియన్ కార్బైడ్ నుంచి సీనియర్ యింజనీర్ జాబ్ ఆఫర్ వచ్చింది. అతను మన సంస్థ ద్వారానే అప్లికేషన్ పంపించాడు. యిప్పుడు రిలీవ్ చెయ్యమని అర్జీ పెట్టుకొన్నాడు."

"అలాగనా? మన కొత్త నాఫ్తా ప్లాంట్‌కి సెకండ్ యిన్ కమాండ్‌గా వేస్తామనీ, రెండు వేలు జీతం పెంచుతామని ఆఫర్ చెయ్యండి."

"యిది హిందుస్థాన్ మోటార్స్‌లో ఓజాబ్ కోసమని కులకర్ణి అనే ఓ యింజనీర్ అప్లికేషన్. ఫార్వర్డ్ చెయ్యమని అభ్యర్థిస్తున్నాడు."

"యిదివరకు ఇతను పై కంపెనీలకి అప్లై చేశాడా?"

"రెండుసార్లు చేశాడు. కాని సెలక్టు కాలేదు".

"అలాగా? మన కంపెనీలోంచి పై కంపెనీలోకి వెళ్ళ ప్రయత్నించి, సెలెక్ట్ కాకపోతే అది మన కంపెనీకి చాలా అవమానకరం! మూణ్ణెల్ల జీతమిచ్చేసి, జాబ్ నుండి రిజైన్ చేసెయ్యమని రిక్వెస్ట్ పంపండి!"

ప్రైవేటీకరణమంటే భయపడేదిందుకేనా?